## క్లుప్తంగా

### ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి: డీఎస్పీ భీంరెడ్డి



నాటిన మొక్కకు నీరు పోస్తున్న డీఎస్పీ భీంరెడ్డి

**జిన్నారం(పటాన్‌చెరు):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని డీఎస్పీ బీంరెడ్డి అన్నారు. శుక్రవారం జిన్నారంలోని పీఎస్‌ను భీంరెడ్డి సందర్శించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పీఎస్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సీఐ వేణుకుమార్, సర్పంచ్ లావణ్య, ఉపసర్పంచ్ సంజీవ, వార్డు సభ్యులు శ్రీధర్‌గౌడ్, లింగం, తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోళ్లు పూర్తి

**పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి**

**జిన్నారం(పటాన్‌చెరు):** గుమ్మడిదల మండలంలో ధాన్యం కొనుగోలును పూర్తి చేశామని పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. మండలంలోని గుమ్మడిదల, నల్లవల్లి, అన్నారం, రాంరెడ్డిబాయి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా 892 మంది రైతుల నుంచి 93 వేల బస్తాల ధాన్యాన్ని సేకరించామన్నారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించామన్నారు. దశలవారీగా రైతుల ఖాతాల్లో డబ్బులు కూడా జమవుతున్నాయన్నారు.

### అన్ని వర్గాలకు సమప్రాధాన్యం

**ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి**

**జిన్నారం(పటాన్‌చెరు):** కుల మతాలతీతంగా అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, దేవాలయాలను అభివృద్ధి చేసేలా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మొల్లగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న హనుమాన్ దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### విద్యాహక్కు చట్టం అమలుపై నిర్లక్ష్యం

**వైయస్సార్ టీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.నరేశ్**

**జోగిపేట(అందోల్):** విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని వైయస్సార్ తెలంగాణ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. నరేశ్ ప్రభుత్వాన్ని కోరారు. జోగిపేటలో విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. పేద విద్యార్థులకు విద్యా హక్కుచట్టం ప్రకారం ప్రతి విద్యాసంస్థలో 25 శాతం ఉచిత విద్యను అందించాలని ఉన్నప్పటికీ ఎక్కడా అమలు కావడంలేదన్నారు. ఈ విషయంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యాహక్కు చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఆయన కోరారు.

### సీబీఐ విచారణ జరిపించాలి

**వట్‌పల్లి(అందోల్):** బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్య చేసుకున్న వడ్ల దీపిక మృతిపై సీబీఐతో విచారణ జరిపించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని బీఎస్పీ అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పారం ప్రకాశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గొర్రెకల్‌లోని మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దీపిక మృతికి స్పందించని విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామ చేయాలన్నారు. దీపిక కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం, ఐదెకరాల భూమి నష్టపరిహారంగా ఇవ్వాలన్నారు.

### ఆర్డీఓ కార్యాలయ డీఏఓగా సతీశ్

**నారాయణఖేడ్:** నారాయణఖేడ్ ఆర్డీఓ కార్యాలయ డీఏఓగా సతీశ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన చంద్రకళ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆయనను పలువురు అభినందించారు.

### మోదీ పాలనతో దేశాభివృద్ధి రేటు అద్భుతం

**నారాయణఖేడ్:** ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన అనంతరం దేశాభివృద్ధి రేటు అద్భుతంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జనవాడే సంగప్ప అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ అవలంబిస్తున్న వ్యవసాయ విధానంతో అనేక అద్భుతాలు సృష్టించారన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రధాని ప్రాధాన్యత ఇస్తున్నాదన్నారు. సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ పాలనలో ప్రతీ ఇంటా సంక్షేమం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్‌చెరు టౌన్:** ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రతీఇంటా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం పాటి గ్రామంలో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని స్థానిక సర్పంచ్ లక్ష్మణ్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మనకు ఏమి చేసిందన్న మూస ధోరణితో ఆలోచించకుండా మనం సమాజానికి ఏ విధంగా ఉపయోగపడుతున్నామన్న ఆలోచనతో ముందుకు వెళ్లాలన్నారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధి కళ్లకు కనిపిస్తుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పల్లెలు నేడు అభివృద్ధికి ప్రతికలుగా నిలుస్తున్నాయంటే సీఎం కేసీఆర్ దృఢ సంకల్పమేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుషా, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, వైస్ ఎంపీపీ స్వప్న, ఎంపీటీసీ సునీత గోపాల్ యాదవ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు స్వామిగౌడ్, భూపాల్ రెడ్డి, డీఎల్‌పీఓ సతీష్ రెడ్డి, ఎంపీడీఓ బన్సీలాల్, గ్రామ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామపంచయతీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**రాష్ట్ర సంస్కరణలు దేశానికి ఆదర్శం**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** సీఎం కేసీఆర్ పరిపాలన రంగంలో చేపడుతున్న సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, ప్రతీ రాష్ట్రం తెలంగాణ వైపే చూస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం భారతినగర్, రామచంద్రాపురం డివిజన్‌లలో నూతనం ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలను ప్రారంభించారు. వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ప్రజల చెంతకే పౌర సేవలను అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే మొట్టమొదటి సారిగా వార్డు కార్యాయాల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్పనగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోవింద్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో పట్టణాలు

**జిన్నారం(పటాన్‌చెరు):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బొల్లారం మున్సిపల్ పరిధిలో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్, ఆర్వో శ్రీధర్, కౌన్సిలర్‌లు హన్మంత్‌రెడ్డి, నిహారిక, గోపాలమ్మ, రాధ, చంద్రయ్య, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవ వేడుకలు**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు)**తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి దినోత్సవాన్ని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత సోమిరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా పట్టణ ప్రగతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత సోమిరెడ్డి మాట్లాడారు. అభివృద్ధే లక్ష్యంగా ముఖ్య మంత్రి కేసీఆర్ ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**నారాయణఖేడ్:** నారాయణఖేడ్ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నారాయణఖేడ్‌లో శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవాన్ని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట చైర్‌పర్సన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డు పొందడంతో మరో రూ.15కోట్లు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పరశురాం, సీడీపీఓ సుజాత, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్: రాజీవ్‌చౌక్‌లో తెలంగాణ పటం ఆకారంలో నిల్చున్న మున్సిపల్ సిబ్బంది



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

### కృత్తికా నక్షత్ర వేడుకలు

**సంగారెడ్డి టౌన్ :** సంగారెడ్డి పట్టణ శివారులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో కృత్తికా నక్షత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చ చేశారు. లలితా సహస్ర నామ పారాయణం పఠించారు. పద్మశాలి కులస్తుల మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి పల్లకీ సేవా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు అమేటి పాండయ్య, అధ్యక్షుడు తోపాజి అనంత కిషన్, ప్రధాన కార్యదర్శి ఇల్లింతల రాజు, కోశాధికారి జూలకంటి మల్లేశం, కార్యనిర్వాహక కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు పంపాటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధాశ్రమం ఏర్పాటు అభినందనీయం

**హత్నూర(సంగారెడ్డి):** అనాథ వృద్ధాశ్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులో యేసయ్య కల్వరి వృద్ధుల అనాథాశ్రమం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న అనాథలకు ఆశ్రయం కల్పించడం గొప్ప సేవా కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, సర్పంచ్ వీరాస్వామి, సర్పంచ్ మాధవి నవీన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు సైకిల్ పంపిణీ

**హత్నూర(సంగారెడ్డి):** మండలంలోని సిరిపుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. శుక్రవారం నిర్మాణ్ ఆర్గనైజేషన ఎన్జీఓ సుభాష్ రెడ్డి సౌజన్యంతో తరుణి ఆర్గనైజేషన్ సంకల్పతరు ఆర్గనైజేషన్, ఇతర ఎన్జీఓ లు సంయుక్తంగా లింగాపూర్ ఇబ్రహీంబాద్, జగ్గంపేట్, గంగారం గ్రామాలకు చెందిన 30 మంది బాలికలకు సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యం, సిరిపుర సర్పంచ్ శ్రీమతి మచ్చ విజయలక్ష్మి నరేందర్, చైర్మన్ పుట్టి కృష్ణ పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించాలి

**రాయికోడ్(అందోల్):** పత్తి విత్తనాల విక్రయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని టాస్క్‌ఫోర్స్ బృందం ఏడీఏ పుష్పరాణి అన్నారు. మండల కేంద్రం రాయికోడ్‌తో పాటు మండల పరిధి చిమ్నాపూర్ గ్రామంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం ఏఓ అభినాష్ వర్మ, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ అంబాజీతో కలిసి తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**న్యాల్‌కల్(జహీరాబాద్):** మండల పరిధిలోని చాల్కి చౌరస్తా వద్ద గల కేతకీ సంగమేశ్వర, న్యాల్‌కల్‌లోని సిద్దేశ్వర విత్తనాలు, ఎరువుల దుకాణాలను శుక్రవారం జహీరాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకుడు భిక్షపతి తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువుల నిల్వలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# విలేకరుల సంక్షేమానికి కృషి

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చంటి రాహుల్ కిరణ్**

**మునిపల్లి(అందోల్):** విలేకరుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చంటి రాహుల్ కిరణ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బుదేరాలో విలేకరులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాలకు ఎంపీపీ శైలజా శివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షి సాయి కుమార్ అధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, ఆర్ఐ రవీందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దలోడి విజయ్‌కుమార్, మండల యువత అధ్యక్షుడు అనంద్, మండల ప్రధాన కార్యదర్శి శశి కుమార్, బుదేరా ఎస్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న చంటి రాహుల్ కిరణ్ తదితరులు

### ముగ్గుల పోటీలు

**కొండాపూర్(సంగారెడ్డి):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ముగ్గులు, పెయింటింగ్, జానపద పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ జానపదాలు, దేశభక్తి గేయాలు, పెయింటింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్లు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ పద్మజ, ఎన్ఎస్ఎస్ అధికారులు, డాక్టర్ జగదీశ్వర్ పాల్గొన్నారు.

### పశువుల తరలింపుపై ఆందోళన

**రామచంద్రాపురం(పటాన్ చెరు):** జహీరాబాద్ నుంచి నగరంలోని ముషీరాబాద్‌కు పశువులను తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం రాత్రి బజరంగ్ దళ్ నాయకులు పట్టుకున్నారు. దీంతో పోలీస్‌స్టేషన్ వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా గోవులను తరలిస్తున్నారని బజరంగ్ దళ్ నేతలు పోలీసులు ఫిర్యాదు చేశారు. కాగా తమను రోడ్డుపై అడ్డుకొని దాడి చేశారని గోవులను తరలిస్తున్న డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జీవాలకు నట్టల నివారణ మందులు వేయించాలి



లేగ దూడకు నట్టల నివారణ మందు వేస్తున్న సర్పంచ్ కుమార్

**సదాశివపేట రూరల్(సంగారెడ్డి):** మూగజీవాలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలని బొబ్బిలిగ్రామ సర్పంచ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడలకు శుక్రవారం నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. మూగజీవాలకు రోగాలబారిన పడకుండా ఉండేందుకు నట్టల నివారణ మందు వేయించాలని పాడి రైతులకు సూచించారు. లేగ దూడలు పుట్టిన పది రోజులకు ఒకసారి నట్టల నివారణ మందులు తాగించాలన్నారు. నట్టల నివారణ మందులు వేయించినట్లయితే దూడల మరణాలు తగ్గించవచ్చని గోపాల మిత్ర సూపర్ వైజర్ చిన్నగల్ల అర్జునయ్య చెప్పారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సురేష్, గోపాల మిత్ర సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్

**మండల విద్యాధికారి దండు అంజయ్య**

**సదాశివపేట రూరల్(సంగారెడ్డి):** చదువుతోనే జీవితం బంగారుమయంగా మారుతుందని మండల విద్యాధికారి దండు అంజయ్య అన్నారు. మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు పరిశీలించి విద్యార్థిని పూజ గత ఏడాది 7వ తరగతి పూర్తి చేసి పాఠశాల రాకపోవడాన్ని గమనించారు. విద్యార్థిని వివరాలు ఆరాతీయగా విద్యార్థి తల్లి మరణించడంతో తండ్రి చదివించడం లేదని తెలియడంతో ఆమె ఇంటికి వెళ్లారు. విద్యార్థి పూజ అమ్మమ్మ సాయమ్మ దగ్గర మేకలు కాస్తూ ఉంది. చదువు విద్యార్థిని అమ్మమ్మకు వివరించారు. 8వ తరగతిలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేర్పించి హాస్టల్ వసతి, పాఠశాల విద్యను ఉచితంగా అందిస్తామని రెండు రోజులలో పాఠశాలలో చేర్పించాలన్నారు. లేనిపక్షంలో బాల కార్మిక చట్టం, విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు. 6 నుంచి 14 సంవత్సరాల వయస్సుగల బాలబాలికలు తప్పనిసరిగా పాఠశాలలో ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లింగం, సీఆర్పీలు రాజేశ్వర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని వివరాలను నమోదు చేసుకుంటున్న ఎంఈఓ అంజయ్య

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కొంగరి జయశ్రీ**

**మనూరు(నారాయణఖేడ్):** అధికారుల సమన్వయంతో పనిచేస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాని మండల ఎంపీపీ కొంగరి జయశ్రీమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. అధికారులు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ప్రజా సమస్యలు తమ దృష్టికి తెస్తే ఎమ్మెలే భూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాములు, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ షాజిలొద్దీన్, తహసీల్దార్ తారాసింగ్, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ ఎంపీఎం వంశీకృష్ణా, వైద్యాధికారి రవి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కొంగరి జయశ్రీమోహన్‌రెడ్డి

# తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

**సమస్యలు చర్చించకుండానే ముగింపు**

**పుల్‌కల్(అందోల్):** ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన మండల సర్వసభ్యసమావేశాలు అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. శుక్రవారం పుల్కల్ మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. ఎంపీపీ చైతన్య విజయ్ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారులు శాఖాపరమైన నివేదికలు చదివి చేతులు దులుపుకున్నారు. ప్రజాప్రతినిదులు కూడా మొక్కుబడిగా సమావేశాలకు వచ్చి వెళ్లారు. మిన్‌పూర్ ఎంపీటీసీ వాటర్ ట్యాంకుల పైకప్పులు సరిగ లేకపోవడంతో నీరు కలుషితమతున్నాయని వాపోయారు. పోచారం గ్రామానికి ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని సర్పంచ్ స్వాతి కోరారు. ప్రజాప్రతినిదులు సమస్యలపై స్పందించకపోవడంతో ఎంపీడీఓ మధులత ఎంపీపీ సూచనతో సమావేశాన్ని ముగిస్తున్నామని ప్రకటించారు. కేవలం స్వల్ప వ్యవధిలో సర్వసభ్య సమావేశం ముగించడంపై విపక్ష సభ్యులు విస్మయం వ్యక్తం చేశారు.

# సకల జీవరాశిలో భగవంతుడిని చూసేదే సనాతన ధర్మం

**మాధవానంద సరస్వతి**

**సంగారెడ్డి మున్సిపాలిటీ:** ప్రకతితో పాటు సకల జీవరాశిలో భగవంతుడిని చూడటమే సనాతన ధర్మ విశిష్టతని రంగంపేట ఆశ్రమం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి అన్నారు. శుక్రవారం చౌటకూరులోని పురాతన కాశీ విశ్వేశ్వరాలయంలో రుద్రపరిషతఖ ఆధ్వర్యంలో మాసశివరాత్రి రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. భారత దేశం కర్మభూమి అన్నారు. ప్రపంచానికి తమ ఆధ్యాత్మిక భావజాలంతో దిశానిర్దేశం చేస్తున్నదన్నారు. మన వారసత్వ సంపద అయినా ఆధ్యాత్మికతను ఆచారిస్తూ, ముందుతారాలకు అందించాలని సూచించారు. వచ్చే మూడు తెలుగు నెలల పాటు ప్రతీ గ్రామంలోని దేవాలయాల్లో పంచాబిల్వయుక్త పూజలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు రాజశేఖర్ కులకర్ణి, సంయుక్త కార్యదర్శి నర్సింహారావు కులకర్ణి, కార్యవర్గ సభ్యుడు దిగ్వాల్ వెంకన్న, మండల శాఖ గౌరవాధ్యక్షుడు చిదిరె నాగేశ్వర్ రావు, ఉపాధ్యక్షుడు రాఘవేంద్రాచారి, కార్యదర్శి జయంతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న స్వామీజీ

## సంక్షిప్త వార్తలు

◆ **23న ఉచిత మెగా వైద్యశిబిరం**

**సదాశివపేట(సంగారెడ్డి):** కోడూరి శరత్ చంద్ర అన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యువనేత కోడూరి శరత్ చంద్ర తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారన్నారు.

◆ **నిలిచిన చెత్త సేకరణ**

**సంగారెడ్డి అర్బన్:** పది రోజులుగా సంగారెడ్డి పట్టణ కేంద్రంలో చెత్తసేకరణ నిలిచిపోయింది. దీంతో పట్టణ ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త పారబోస్తున్నారు. వర్షాకాలం రానున్న దృష్ట్యా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

◆ **సినీ ప్రేక్షకుల ఆగ్రహం**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** రామచంద్రాపురం పట్టణంలోని జ్యోతి సినిమా థియేటర్‌లో శుక్రవారం ఉదయం ఆదిపురుష్ సినిమా ప్రదర్శన ఆలస్యం కావడం, పాటు సౌండ్ సిస్టం సరిగా లేదని ప్రేక్షకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమా మధ్యలో థియేటర్‌లోని కుర్చీలను, అద్దాలను ధ్వసం చేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

◆ **దరఖాస్తు గడువు పొడిగించాలి**

**మునిపల్లి(అందోల్):** చేతి వృత్తుల అభివృద్ధి కోసం రూ.లక్ష ఆర్థిక సాయం దరఖాస్తు గడువు పొడిగించాలని బీజేపీ ఓబీసీ మండల అధ్యక్షుడు అల్లాపూరం శంకరయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు గడువు ముగియ నుండటంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతునారన్నారు. పోటో: 16జేజీపీ72: వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ ఓబీసీ మండల అధ్యక్షుడు శంకరయ్య

◆ **సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

**మునిపల్లి(అందోల్):** రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు వేయనున్నట్లు జెడ్పీటీసీ మీనాక్షి సాయి కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సహకారంతో మండలంలోని ప్రతీ గ్రామంలో సీసీ రోడ్డు వేయనున్నట్లు తెలిపారు.

◆ **నల్లపోచమ్మ గుడి నిర్మాణానికి శంకుస్థాపన**

**జిన్నారం(పటాన్‌చెరు):** నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌లో నల్లపోచమ్మ దేవాలయ నిర్మాణానికి ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ శంకర్‌లు శుక్రవారం శంకుస్థాపన చేశారు. త్వరగా దేవాలయ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

◆ **ఈద్గా నిర్మాణానికి శంకుస్థాపన**

**జిన్నారం(పటాన్‌చెరు):** మండలంలోని కొడకంచి గ్రామంలో చేపట్టిన ఈద్గా నిర్మాణానికి శుక్రవారం జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నిధులు కేటాయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **25న వివాహ పరిచయ వేదిక**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** అఖిల బ్రాహ్మణ సమాజ అభివృద్ధి సంస్థ బెల్ శాఖ ఆధ్వర్యంలో ఈనేల 25వ తేదీన వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవి శాస్త్రి శుక్రవారం తెలిపారు. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయత్రం 4గంటల వరకు పరిచయ వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, వధూవరులు తమ పేర్లను అసోసియేషన్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

◆ **కబ్జాలపై ఉద్యమిస్తాం**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువుల కబ్జాలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెల్లాపూర్ మాజీ నీటి సంఘం చైర్మన్ వడ్డే నరసింహ, తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ హెచ్చరించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. చెలికుంట ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు, వనం చెరువు, చెలికుంట కబ్జాకు గురవుతున్నాయని తెలిపారు. ఈ విషయంపై హెచ్ఎండీఏ కమిషనర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు.

◆ **ఓపెన్ స్కూల్ పది ఫలితాల్లో మనూరు టాప్**

**మనూరు(నారాయణఖేడ్):** ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మనూరు ఉన్నత పాఠశాల మొదటి స్థానంలో నిలిచిందని పాఠశాల హెచ్ఎం నాగారం శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఓపెన్ పరీక్షల్లో 44 మంది పరీక్షలు రాయగా 33 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్‌లో 33 మంది విద్యార్థులకుగాను 28 మంది ఉత్తీర్ణులయ్యారు. పాఠశాల ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ధన్‌సింగ్ నాయక్‌ను, విద్యార్థులను అభినందించారు.

◆ **ధ్రువీకరణ పత్రాలను వెంటనే ఇవ్వాలి**

**సంగారెడ్డి టౌన్:** కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెంటనే అందించాలని, ఇవి సకాలంలో అందక విద్యార్థులు, కులవృత్తులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సహాయం పొందాలనుకున్న వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కులబ్ గూర్ గ్రామ వార్డు సభ్యుడు పి.కృష్ణ అన్నారు. రూ.లక్ష ఆర్థిక సహానికి ఈనెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించినప్పటికీ సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

**రాయికోడ్(అందోల్):** మండల కేంద్రం రాయికోడ్‌కు చెందిన మొగిలిగిద్దె లక్ష్మి కుటుంబ సభ్యులకు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు చెవెళ్ల విఠల్, తిరుమల శ్రీకాంత్ సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. లక్ష్మి ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందింది. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో ప్రభుత్వం వైద్యఖర్చులు కొంత మంజూరు చేసింది.

◆ **సమాజంపట్ల బాధ్యత ఉండాలి**

**కొండాపూర్(సంగారెడ్డి):** ప్రతీ వ్యక్తికి సమాజం పట్ల బాధ్యత ఉండాలని మండల పరిషత్ అధ్యక్షుడు మనోజ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి కొండాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎస్‌బీఐ సీఎస్ఆర్ రూ.10 లక్షలతో నిర్మించిన ఆపరేషన్ థియేటర్‌లో ఏసీలు తదితర ఉపకరణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ సంధ్యారాణి, మెడికల్ ఆఫీసర్ రేష్మాఅంజుమ్, ఎంపీడీఓలు జయలక్ష్మీ, సర్పంచ్ వెంకటేశం గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **అధిక ఫీజులను అరికట్టాలి**

**కొండాపూర్(సంగారెడ్డి):** డొనేషన్ల పేరుతో అడ్మిషన్లు తీసుకుంటూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్కూల్ ఎదుట ధర్నా చేశారు. స్కూల్ యజమానంపై చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లాలో పర్మిషన్ లేని వాటిని సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్ సహాయ కార్యదర్శి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.